ప్రజల చేతిలో

# ఆయుధం

www.ayudamdaily.com

The Common People's Voice

బుధవారం | సెప్టెంబరు 23, 2026 | సంపుటి : 7 | సంచిక : 96 | పేజీలు : 2



## హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి

- బీజేపీ, బీఆర్ఎస్‌లు రెండు ఒకటే..
- దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై వాక్యాలు చేస్తే సహించం..
- రామ మందిరంలో చోరీకి పాల్పడిన దొంగలు బీజేపీ నాయకులు..
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, ప్రతి పనికీ డెడ్‌లైన్ నిర్ణయించి ఎప్పటిలోగా పూర్తి చేయాలో స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించామని తెలిపారు.
మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వచ్చే నెల దసరాలోపే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని, కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.
జీవోలు ఇచ్చి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని నాయిని అన్నారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రం తన బాధ్యతగా భూమిని సమకూర్చినందున విమానాశ్రయ నిర్మాణం, తదుపరి ప్రక్రియలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని నాయిని అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని విమర్శించారు. గాంధీ కుటుంబంపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన నాయిని.. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబాన్ని విమర్శించే ముందు తమ చరిత్రను చూసుకోవాలని అన్నారు.
వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు నాయకులు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని నాయిని ఆరోపించారు. గత పదేళ్లలో వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు వచ్చినా పూర్తిస్థాయిలో ఎందుకు వినియోగించలేకపోయారో గత పాలకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఒడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌కు సుమారు రూ.550 కోట్ల ప్రాజెక్టు తీసుకొచ్చామని నాయిని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభమయ్యాయని, మెటీరియల్ కూడా సైట్‌కు చేరుతోందన్నారు. 30-40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. చిన్నచిన్న పనులు చేసి ఫొటోలు దిగడం కాకుండా భవిష్యత్ అవసరాలకు సరిపోయే భారీ ప్రాజెక్టులను (మిగతా 2లో..)



## బంగాళాఖాతంలో వాయుగుండం

- తెలంగాణలో 3 రోజుల పాటు అతి భారీ వర్షా లు

**హైదరాబాద్, ఆయుధం:** వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచనలున్నాయని తెలిపింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచనలున్నాయని చెప్పింది.

## ఎంజీఎం ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత



### పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య పెనుగులాట

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కాలు, చేతికి గాయాలు
- ఎంజీఎం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- తనను కడుపులో తన్నారని కన్నీళ్లు పెట్టుకున్న దాస్యం
- వినయ్ భాస్కర్‌ను ఆస్పత్రికి తరలించిన పోలీసులు, చికిత్స

ఎంజీఎం ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎంజీఎం ఆస్పత్రిలో ఇటీవల పైకప్పు పెచ్చులూడి రోగులు గాయపడిన ఘటనపై ఆస్పత్రిని సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఆస్పత్రి సందర్శనకు అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. కనీసం రోగులను పరామర్శించేందుకు అనుమతించాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరగా.. పోలీసులు అడ్డుకున్నారు. నిర్బంధాలను ఛేదించి వరంగల్ ఎంజీఎంను సందర్శించేందుకు దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారు. పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించగా పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ కాలు, చేతికి గాయాలయ్యాయి. పోలీసులు కడుపులో తన్నారని వినయ్ భాస్కర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు ఎంజీఎం వద్దే రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద ప్రజలకు కనీస వైద్యం అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందంటూ దాస్యం వినయ్ భాస్కర్ దుయ్యబట్టారు. ప్రజా పాలన అని చెప్పి ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆస్పత్రిలో రోగులకు సరిపడా బెడ్లు లేవని.. భవనం పైకప్పులు పెచ్చులూడుతున్నాయని.. అంబులెన్స్‌ల కొరతను ఈ పాలకులు గత మూడేళ్లుగా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎంను సందర్శించనియ్యకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనం అని మండిపడ్డారు.

## వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- మెడికో-లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్



(వివరాలు 2లో..)

**హనుమకొండ, ఆయుధం:** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం ఆయన హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.



## పారదర్శకంగా భూముల రీసర్వే

- అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హసన్‌పర్తి, ఆయుధం:** జిల్లాలోని గ్రామాలలో చేపట్టిన భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో భూముల (మిగతా 2లో..)



## టీబీ ముక్త్ భారత్ కై ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- క్యాంపులను పక్కాగా నిర్వహించి స్క్రీనింగ్ చేయాలి
- హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఆయుధం:** టీబీ ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టీబీ నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే స్క్రీనింగ్ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టి, వ్యాధి లక్షణాలు ఉన్న వారిని త్వరగా గుర్తించి తగిన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో కూడా సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమం అమలు తీరును సమీక్షించాలన్నారు. టీబీ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. హై రిస్క్ కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన పరీక్షలు, చికిత్స, మందుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. టీబీ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, వ్యాధిని ముందస్తుగా గుర్తించడం ద్వారా మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ అధ్యక్షులు డాక్టర్ మన్మోహన్ రాజు 50 న్యూట్రిషన్ కిట్లకు అయ్యే ఖర్చు 35 వేల రూపాయలను అందజేయగా , సామాజిక బాధ్యతలో భాగంగా టీబి &చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి రవి 10 న్యూట్రిషన్ కిట్లు,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాయంపేటలో పనిచేస్తున్న బి.మల్లేశం 10 న్యూట్రిషన్ కిట్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఐదు న్యూట్రిషన్ కిట్స్, డిప్యూటీ DMHO, డాక్టర్ ప్రదీప్ రెడ్డి ఐదు న్యూట్రిషన్ కిట్స్ ను...టీబి తో బాధపడుతున్నటువంటి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గిరిరాజ్ గౌడ్ ,జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, కాకతీయ వైద్య కళాశాల ఎస్.పి.ఎం డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విద్యా ప్రదాత తాళ్ల మల్లేశం మరణం తీరని లోటు

- ప్రముఖుల సంతాపం
- కుటుంబ సభ్యులను పరామర్శించిన రాపోలు ఆనంద భాస్కర్, వన్నాల శ్రీరాములు, సాంబారి సమ్మారావు ప్రముఖ నేతలు!



**వరంగల్, ఆయుధం:** ఉత్తర తెలంగాణ విద్యారంగంలో తనదైన ముద్ర వేసి, వేలాది మంది విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసిన విద్యా ప్రదాత, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ స్వర్గీయ తాళ్ల మల్లేశం అకాల మరణం విద్యా రంగానికే కాకుండా యావత్ సమాజానికి తీరని లోటని పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన తాళ్ల మల్లేశం నివాసానికి మంగళవారం ప్రముఖులు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తనయులు తాళ్ల వరుణ్, తాళ్ల వంశీలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ వారిని ఓదార్చారు.
పరామర్శించిన వారిలో మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి మరియు 'ధీంబాయ్ టీవీ' సీఈవో వేముల సదానందం నేత తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిరంతరం విద్యార్థుల ఉన్నతిని కాంక్షించే గొప్ప దార్శనికుడు తాళ్ల మల్లేశం అని కొనియాడారు. విద్యారంగాన్ని ఒక సేవా యజ్ఞంలా భావించి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల ద్వారా ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అటు విద్యారంగానికి, ఇటు పద్మశాలి సమాజ వికాసానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలు ఎల్లప్పుడూ స్మరణీయమని, ఆయన మృతి సమాజానికి తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లేశం ఆశయాలను, విలువలను ఆయన తనయులు మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## పెద్దమ్మగడ్డను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1.43 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు శంకుస్థాపన



**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పెద్దమ్మగడ్డ కాలనీకి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్దమ్మగడ్డ ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని వెనుకబడిన ప్రాంతంగా ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నారే తప్ప, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలనే ఆలోచనతో ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు.
ప్రజలకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఈ అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.1.43 కోట్లతో నిర్మిస్తున్న ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండేలా, శాశ్వతంగా వైద్య సేవలు అందేలా సంబంధిత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు వెల్లడించారు. పెద్దమ్మగడ్డ అభివృద్ధికి హెల్త్ సెంటర్‌తో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తామని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కూడా పరిశీలించి, అందుకు అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్దమ్మగడ్డ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లాలో నిమజ్జనం ప్రక్రియ సాఫీగా పూర్తి కావాలి

- నోడల్ అధికారుల నియామకం
- నిమజ్జనం పూర్తి అయ్యేవరకు తప్పకుండ ఉండాలి
- భక్తులకు ఇబ్బందులు కలగద్దు
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ఈ నెల 23న జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా అధికారులు సమన్వయముగా పని చేసి జిల్లా లో ప్రశాంత వాతావరణం లో నిమజ్జన ప్రక్రియ పూర్తి అయ్యేలా పని చేయాలనీ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. వినాయక నిమజ్జనం ఏర్పాట్ల మీద మంగళవారం కలెక్టర్ చాహత్ బాజ్ పాయి...అదనపు కలెక్టర్ రవి, Gwmc కమిషనర్ వెంకన్న, ఆర్డీవో లు, డీసీపీ లు, ఏసీపీ లు,రెవిన్యూ, పోలీస్, ఆర్ అండ్ బి ఇరిగేషన్, విద్యుత్, మత్స్య, వైద్య మొదలగు శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలును తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా లో వినాయక నిమజ్జనం అయ్యే ప్రతీ చోట అధికారులు అలర్ట్ గా ఉండి నిమజ్జనం ప్రక్రియ సాఫిగా జరిగేలా బాధ్యత గా వ్యవహారించాలన్నారు. అన్నీ చోట్ల క్రేన్స్ అందుబాటులో పెట్టాలన్నారు. లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జనరేటర్స్ లను కుడా అందుబాటులో పెట్టుకోవాలన్నారు. తాగు నీరు సదుపాయం, లైఫ్ జాకెట్స్, గజ ఈతగాళ్లు ఉండాలన్నారు. నిమజ్జనం పాయింట్ ల వద్ద డ్యూటీ ఉన్న ప్రతీ అధికారి నిమజ్జనం పూర్తి అయ్యే వరకు అలర్ట్ గా ఉండాలన్నారు. నిమజ్జనం ప్రక్రియ ని పర్యవేక్షణ చేయడానికి నోడల్ అధికారులను నియమించామన్నారు.. వారందరు తమ విధులను సరిగ్గా నిర్వహించాలన్నారు. నిమజ్జనం చోటు కీ వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**పరకాల, ఆయుధం:** పరకాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం పరకాల నూతన ఏరియా ఆసుపత్రి భవనంలో కల్పించిన మౌలిక సదుపాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రేడియాలజీ విభాగం, లేబర్ రూములు, బ్లడ్ బ్యాంక్, ఎమర్జెన్సీ, క్యాజువాలిటీ విభాగాలను ఏర్పాటు చేయగా, మొదటి అంతస్తులో ఓపీ బ్లాక్, సూపరింటెండెంట్ కార్యాలయం, పరిపాలనా విభాగంతో పాటు నియోనాటల్ కేర్ యూనిట్, ఐసోలేషన్ వార్డులు, ఐసీటీసి క్లినికల్ సేవలకు సంబంధించిన కేంద్రాల ఏర్పాటు, రెండో అంతస్తులో పీడియాట్రిక్, ప్రసవానంతర (పోస్ట్‌నేటల్), గర్భిణీల (యాంటీనేటల్), ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాజీ,, జనరల్ మెడిసిన్, పురుషులు, మహిళలకు సంబంధించిన వార్డులు, పెయింగ్ రూమ్స్, పాథాలజీ విభాగానికి సంబంధించిన గదులను, మూడో అంతస్తులో ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, జనరల్ సర్జరీ పురుషులు, మహిళల వార్డులను ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలు, వైద్య సేవలకు సంబంధించిన మౌలిక వసతులను పరిశీలించారు. ఆయా విభాగాలను కలెక్టర్ సందర్శించి వాటి వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాత ఆసుపత్రి నుంచి నూతన ఆసుపత్రిలోకి అన్ని విభాగాలను తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ పనులు నాణ్యతతో ఉండాలని, ఆక్సిజన్ పైప్ లైన్స్ పనులు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, టీజీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నందు పటేల్, పరకాల ఆర్డీవో డిఎస్. వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# గోసంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టాలి

- గోమాతకు జాతీయ గౌరవాన్ని, సంపూర్ణ సంరక్షణ కల్పిస్తూ గోహత్య నిషేధ చట్టాలను రూపొందించాలి - డా. మోహనకృష్ణ భార్గవ..
- ఒకేరోజు వేయి సంతాకాల సేకరణ..

**జనగామ, ఆయుధం:** గో సంవర్ధన ప్రచార సమితి, గోసమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ఆధ్వర్యంలో ప్రతినిధి, ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మద్దతుదారుల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. స్థానిక శ్రీరాంనగర్, రేణుక నగర్, మూలబావి, గుండ్లగడ్డ, గిర్నిగడ్డ, ధర్మకంచ మొదలగు ప్రాంతాలలో గో సంరక్షణ చట్టాల నిర్మాణానికి మద్దతు తెలిపే పౌరుల సంతకాలు సేకరించారు. ఒకేరోజు సుమారు వేయిమంది పౌరులు సంతకాలతో తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిరంతరం కొన్ని లక్షల గోవులు హత్యకు గురౌతున్నాయని, అక్రమ రవాణా వధ విక్రయాలు జరుగుతున్నాయని, క్రమక్రమంగా గోమాతల సంతతి క్షీణించిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న గోమాతల అక్రమ రవాణా వధలపై అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించామని, "ఆపరేషన్ గోరక్ష" వంటి భారీ నిరసనలు, నాలుగు సార్లకు పైగా కలెక్టర్ మెమోరాండం , పోలీస్ యంత్రాంగం దృష్టికి తీసుకువెల్లడం, అక్రమ రవాణా వాహనాల నిలిపివేత వంటి కార్యక్రమాలు అనేకం చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లభించలేదని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం గో సంరక్షణ చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేసారు. జిల్లాలో భారీ స్థాయిలో గోవర్ధన నంది గోశాల, గో అవగాహన కేంద్రం, రైతులకు గో వ్యవసాయ ప్రోత్సహాలు గౌరవ వేతనాలు, గో ఆధారణ ఉత్పత్తుల తయారీ, విద్యావ్యవస్థలో గో విజ్ఞాన్ పాఠ్యాంశంగా చేర్చుట, గో సంరక్షణ ప్రత్యేక విభాగం, ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గో సంవర్ధన సమితి సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దల్, మాతృశక్తి సభ్యులు, వినాయక ఉత్సవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- మెడికో-లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్



**హనుమకొండ, ఆయుధం:** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేదికతో పాటు మెడికోలీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని వినోద్ కుమార్ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షులు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన సూచించారు. ఈ విషయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ కోరారు. ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, ఫిర్యాదులు మరియు వైద్య నివేదికల ఆధారంగా చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలన, శాంతియుత వాతావరణం తెలంగాణ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాంటి రాష్ట్రంలో ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయని ఆరోపణలు రావడం, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారనే ఫిర్యాదులు రావడం ఆందోళనకర అంశమని అన్నారు. వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అసలు ఏం జరిగిందనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని ఆయన కోరారు. ఎవరి ప్రమేయం ఉన్నా, విచారణలో ఆధారాలు బయటపడితే వారికి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ ఘటనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని, బాధితుడి వాంగ్మూలం, వైద్య నివేదిక, మెడికోలీగల్ నివేదికతో పాటు అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ పోలీసులను కోరారు. పోలీస్ కమిషనర్ ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దాస్యంపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం: తెలంగాణ బీసీ మహాసేన

**వరంగల్, ఆయుధం:** మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మీద జరిగిన పోలీస్ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీసీ మహాసేన నాయకులు ప్రకటించారు. ఎంజీఎం లో పెచ్చులూడి పేషంట్లపై పడడం, ఎలుకలు పేషంట్లను కొరకడం, పాములు ఎంజీఎం ఆసుపత్రిలో తిరగడం వీటన్నిటినీ ప్రశ్నించడానికి మాజీ చీఫ్ దాస్యం వినయ భాస్కర్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించడానికి వెళ్తే పోలీసులు, దాస్యం వినియ భాస్కర్, బిఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులపై దాడి చేశారన్నారు. వినయభాస్కర్ కడుపులో పిడిగుద్దులు, గోరు మీద బూట్లతో తొక్కారని.. శ్వాస ఆడక వరంగల్లోని ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలను ఖండిస్తూ సిపి, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి ఘటనకు సంబంధించిన పోలీసుల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# జూనియర్ కళాశాల కు స్టేజీ ప్రారంభం

**జనగామ, ఆయుధం:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు రూ.మూడు లక్షల వ్యయంతో నిర్మించిన కళాశాల ప్రేయర్ స్టేజి ఓపెనింగ్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో స్టేజి నిర్మాణ దాత లయన్ ఏడ్మ సుగుణ సంజీవ రెడ్డి, కుటుంబ సభ్యులు దయాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ డి జి ఎల్ ఓ లయన్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, లయన్ కృష్ణ జీవన్ బజాజ్ పాల్గొన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ఈ కళాశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నటువంటి లయన్ క్లబ్ సభ్యులకు, స్టేజి నిర్మాణ దాత ఏడ్మ సుగుణ సంజీవరెడ్డి ని కళాశాల అధ్యాపక బృందం సన్మానం చేశారు. కళాశాలకు వివిధ రకాల విరాళాలు ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కళాశాల సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరమని రీజినల్ చైర్మన్ జైన రమేష్, ప్రెసిడెంట్ రావుల రవి అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ పి డి జి లు కన్నా పరశురాములు, లవన్ కుమార్ రెడ్డి, చార్టర్ మెంబర్స్ పజ్జూరి గోపయ్య, పజ్జూరి జయహారి, ఆర్యవైశ్య మహాసభ మహిళా జనగామ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ వరుదిని మాధంశెట్టి, వాసవి క్లబ్ జనగామ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కాపర్తి శ్రీనివాస్, కళాశాల అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా భూముల రీసర్వే

(మొదటి పేజీ తరువాయి..)

రీసర్వే పై అవగాహనకు భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లు భూముల రీసర్వే కి సంబంధించిన అంశాలపై గ్రామసభలో రైతులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావులేకుండా భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. భూముల రీ సర్వే చేపడుతుండగా గ్రామ రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సర్వేయర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, భూములు కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, తహసిల్దార్ కిరణ్ కుమార్, డీఐ సారంగపాణి, ఇతర అధికారులు, వార్డు సభ్యులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.



# అన్ని దానాలలో అన్నదానం గొప్పది

- భక్తిశ్రద్ధలతో గణేశ నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజలు, అన్నదానం

**రఘునాథపల్లి, ఆయుధం:** అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పదని భావిస్తూ గణేశ నవరాత్రి ఉత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని గిర్నిగడ్డ సమీపంలో బీఆర్ఎస్ జిల్లా యువనేత దుబ్బాక హరీష్ గౌడ్, నీరజ దంపతులు దుబ్బాక కుటుంబ సభ్యులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఇంటి సమీపంలో భక్తులు, గ్రామస్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దుబ్బాక హరీష్ గౌడ్ దంపతులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం గణేశుడి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల రవి గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు బాల్నే పరశురాములగౌడ్, దుబ్బాక నర్సింహులు, మరకల మహేందర్, నోముల మహేందర్, సురుగు రమేష్, సురుగు హరీష్, డీజే మహేందర్, శత్రసి రాము, కంటడి రోహిత్, చెరుకు అజయ్, పొలస నాగరాజు, సురుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

**రఘునాథపల్లి, ఆయుధం:** అంతర్జాతీయ పోషణ మాసం సందర్భంగా రఘునాథపల్లి 1 అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం ఉమారాణి, ఏసీడీపీవో శోభ, సూపర్‌వైజర్ మంజుల, ఆరోగ్య శాఖ MPHA(F) సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు తొలి 1,000 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఐరన్, కాల్షియం మాత్రలు తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారాన్ని అందించాలని అవగాహన కల్పించారు. ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి టీచర్ మరకాల శ్రీలత, అరుణ రేణుక రాజమణి, పాల్గొన్నారు.

# శివనగర్‌లో ఘనంగా గణనాథుడికి పూజలు

- భారీ అన్నదాన కార్యక్రమం
- హాజరైన మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సీనియర్ జర్నలిస్టు నేత వేముల సదానందం, జనసేన నాయకుడు కరాటే ప్రభాకర్



**వరంగల్, ఆయుధం:** వరంగల్ శివనగర్ ప్రాంతంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రముఖ ఫైనాన్స్ వ్యాపారి వద్దె కోటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, డీంబాయ్ టీవీ సీఈఓ వేముల సదానందం నేత, జనసేన పార్టీ నాయకులు కరాటే ప్రభాకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అతిథులు స్వయంగా భక్తులకు అన్నదానం చేసి మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని, ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బంగాళాఖాతంలో వాయుగుండం

## 3 రోజుల పాటు అతి భారీ వర్షా లు

**హైదరాబాద్, ఆయుధం:** వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచనలున్నాయని తెలిపింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచనలున్నాయని చెప్పింది.

### ఆరెంజ్ హెచ్చరికలు జారీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ మినహా మిగతా జిల్లాలకు భారీ వర్ష సూచనలున్నాయి. వాతావరణ శాఖ ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. రాగల 12 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో రేపు, ఎల్లుండి అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు 8 జిల్లాలకు అత్యంత భారీ, 9 జిల్లాలకు అతి భారీ, మిగిలిన అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని స్పష్టం చేసింది.

### ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్

బుధవారం అత్యంత భారీ వర్షాలు కురిసే పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రేపు అతి భారీ వర్షాలు కురిసే కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 24న రాష్ట్రంలోని 10 జిల్లాలకు అత్యంత భారీ, 10 జిల్లాలకు అతి భారీ, మిగిలిన అన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అత్యంత భారీ వర్షాలతో కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

# హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..)

చేపడుతున్నామని తెలిపారు. గత పదేళ్ల పాలనలో అవినీతి, ఆస్తుల వ్యవహారాలపై పలు ఆరోపణలు చేసిన ఆయన.. వాటిపై సంబంధిత నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిపై మాట్లాడే ముందు గత పాలనలో జరిగిన పనులపై లెక్కలు చెప్పాలని అన్నారు.

సోషల్ మీడియాలో ఒక అబద్ధాన్ని పదిసార్లు ప్రచారం చేసినంత మాత్రాన అది నిజం కాదని నాయిని అన్నారు. ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం విమర్శలు చేస్తున్నారో గమనిస్తున్నారని చెప్పారు. వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ డ్రామాల కంటే వరంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని, తాము డేటాతో కూడిన పూర్తి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని నాయిని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వరంగల్‌ను కీలక నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మా సమాధానం మాటల్లో కాదు జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఉంటుంది అని నాయిని స్పష్టం చేశారు.

# ఎంజీఎం లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- సిపిఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్




**వరంగల్, ఆయుధం:** ఎంజీఎం హాస్పిటల్‌లో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంజీఎం గేటు ముందు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య అధ్యక్షతన సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్ మాట్లాడుతూ.. ఎంజీఎం హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ వార్డులో భవనం పై కప్పు పెచ్చులూడి మస్తాన్, ఎల్లమ్మ, ఓంకార్ అనే ముగ్గురు పేషంట్ల పై పడగా వారికి గాయాలయ్యాయని.. ఈ భవనం శిథిలావస్థకు చేరినాకూడా ప్రభుత్వం అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఉత్తర తెలంగాణకే పెద్దదిక్కుగా ఉన్నటువంటి ఎంజీఎం హాస్పిటల్ లో సౌకర్యాలు శూన్యమని అన్నారు. గతంలో ఇక్కడ ఎలుకలు పేషెంట్ల కాళ్లు కొరికినాయని, కుక్కలు, పందులు తిరుగుతూ అశుభ్రంగా పరిసర ప్రాంతాలు ఉన్నాయని అధికారుల ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వలన పేషంట్ల ప్రాణాలు పోతున్నాయని అన్నారు. ఎంజీఎంలో డాక్టర్స్ సరిగా అందుబాటులో ఉండరని ఓపిలో రోజుకు మూడు నాలుగు వేల మంది వరకు గంటల తరబడి లైన్లో నిలబడి ఉండాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. న్యూరో సర్జరీ, న్యూరో ఫిజిషియన్ లేక పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డయాలసిస్ పేషెంట్స్ కు కిట్లు ఇవ్వకపోవడం వలన పేషెంట్లు వాటిని బయట కొనుక్కోవాల్సి వస్తుందని అన్నారు. కార్డియాలజీ విభాగంలో డాక్టర్లు లేరనీ, మహిళా టెక్నీషియన్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ లేరని, ఆర్థోపెడిక్ విభాగంలో కొత్త యంత్రాలు లేవని అన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఎంజీఎం హాస్పిటల్ పరిస్థితి దాపురించిందని అన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు స్పందించి పేద ప్రజలకు వైద్యం అందేలా ఎంజీఎం లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. భవిష్యత్తులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బషీర్, సిపిఎం నాయకులు, నాగపురి వెంకటేశ్వర్లు, రామా సందీప్, పులి మాటి శివ, వంశీఆరేపల్లి బాబు, వెంకటస్వామి, వీరస్వామి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695